


నేటి దినపత్రిక
# సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం | 04 డిసెంబర్ 2024 | పేజీలు 8

## కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి : కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ వారి చాంబర్లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల త్రైమాసిక పరీక్షల ఫలితాలపై ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన త్రైమాసిక పరీక్షల ఫలితాలలో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణతశాతం బాగా తగ్గిందని, రానున్న అన్ని పరీక్షల్లో కూడా ఈ శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు అందరూ ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా, కళాశాలలకు రాని విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఆ విద్యార్థులందరూ కూడా కళాశాలలకు వచ్చేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో అమలు చేస్తున్న సంకల్ప్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, స్టడీ అవర్స్ ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. కళాశాలలో నమోదైన విద్యార్థులు అందరూ కూడా పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను కూడా పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఐఓ శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా..

## వీపీఆర్ ఫౌండేషన్


- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా 107 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ పంపిణీ
- దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలుకు పెంచిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు
- ప్రజాసేవ చేయడం కోసమే.. ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చాం
- పరోపకారం ఆశించని ప్రజాసేవ చేయడమే వీపీఆర్ ఫౌండేషన్ లక్ష్యం
- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



2లో..



ఖాతా నెంబర్‌కు.. కాసులు !



ఏసీబీకి పట్టుబడిన

## తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**

పంటపాలెంకు చెందిన మహిళ రైతు కాంతమ్మ తన భూమికి సంబంధించిన సర్వేనెంబర్ 60/1 ఈపూరు బిట్-1లోని 1.12 సెంట్లు పొలానికి సంబంధించిన నోషనల్ నెంబర్ తొలగించి ఖాతా నెంబర్ వేయమని ముత్తుకూరు మండల తహసిల్దార్ బాలకృష్ణారెడ్డిని కోరారు. తల్లి తరఫున తనయుడు వెంకట రమణయ్య నాయుడు తహసిల్దారును కలసి విజ్ఞప్తి చేశారు. రెండు నెలలుగా ఈ సమస్యపై తహసిల్దార్‌తో మాట్లాడు తుండగా, లంచం అనే పదం తెర మీదకు వచ్చిం ది. భూమి మాత్రం పట్టా భూమి. ప్రభుత్వ అధికారిగా తహసిల్దారు ఈ పని చేసి పెట్టాలి. లక్షల రూపాయలు జీతం తీసుకున్న తహసిల్దార్ లంచం అడిగాడు. సుమారు రూ.50 వేలు రైతుతో బేరసారాలు ఆడాడు. తన వద్ద అంత లేదని కాంతమ్మ తనయుడు చివరకు రూ.20 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకోగా, రూ.25 వేలకు తహసిల్దార్ తన లంచాన్ని నిర్ధారించుకున్నాడు. సరే ఇక చేసేదేమీ లేక భూమి యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. రెండు రోజుల క్రితమే ఏసీబీ అధికారులు తహసిల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి రెక్కీ నిర్వహించారు. బాధితురాలు తనయుడు వెంకట రమణయ్య నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు మంగళవారం తహసిల్దార్ కార్యాలయంపై దాడి చేశారు. 11.30 గంటల సమయంలో తహసిల్దార్ రెవెన్యూ కార్యాలయంలో ఉన్నప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తి తహసిల్దార్‌కు లంచం ఇచ్చాడు. వెంటనే ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వెళ్లి ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శిరీష తహసిల్దార్‌ను అదుపులోకి

-మిగతా 2లో

- నోషనల్ నెంబర్ తొలగించమని వేడుకుంటే బేరసారాలు
- రూ.25 వేలకు కుదిరిన ఒప్పందం..
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబి బృందం
- ముత్తుకూరు రెవెన్యూ కార్యాలయంలో ఏసీబి సోదాలు

# సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్

**సిలాట్ చాంపియన్ షిప్‌లో.. విజేతగా నిలిచిన చరణ్‌తేజ : అభినందించిన ఎస్పీ కృష్ణకాంత్**



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్ -2024లో రెండవ బహుమతి పొందిన చరణ్ తేజ, మూడవ బహుమతి పొందిన రాజశేఖర్, 25వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ మీట్‌లో మూడవ బహుమతి పొందిన పుల్లయ్యలను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం పోలీస్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. నవంబర్ 19 నుండి 21 వరకు శ్రీనగర్‌లోని ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియంలో సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ చాంపియన్ షిప్-2024ను దేశవ్యాప్తంగా నిర్వహించగా, అండర్ 95 పెన్ కాక్ సిలాట్‌లో సిల్వర్, అండర్ 110 పెన్ కాక్ సిలాట్‌లో నెల్లూరు పోలీసులు చరణ్‌తేజ, రాజశేఖర్‌లు సత్తా చాటారన్నారు. అంతేకాకుండా 25వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ మీట్-2024 నవంబర్ 16 నుండి 22 వరకు నాగాలాండ్‌లో దేశవ్యాప్తంగా పోలీసులకు నిర్వహించగా, ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ బిగిల్ టీంతో కలిసి బ్రాంజ్ మెడల్ సాధించిన నెల్లూరు పోలీస్ కానిస్టేబుల్ వి.పుల్లయ్య, ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ మీట్-2024లో తృతీయ స్థానం సాధించగా బ్రాంజ్ మెడల్, సర్టిఫికెట్ను అందుకున్నారని తెలిపారు. ఏఆర్పీసీ కె.చరణ్ తేజ, స్పెషల్ పార్టీ, నెల్లూరు అండర్-95 పెన్ కాక్ సిలాట్ విభాగంలో రెండవ స్థానం సాధించగా వారికి సిల్వర్ మెడల్, సర్టిఫికెట్‌ను అందించారు. బాగా తర్ఫీదు పొందాలని, తదుపరి నిర్వహించే క్రీడలలో పాల్గొని మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సౌజన్య, డీఎస్పీలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## ఏసీబీకి పట్టుబడిన తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి



*(మొదటి పేజీ తరువాయి)*

తీసుకున్నారు. కార్యాలయంకు నాలుగువైపులా తలుపులు మూసేసి తహసిల్దార్‌ను విచారించారు. లంచం తీసుకున్నట్టుగా నిర్ధారణ అయింది. రెవెన్యూ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు అనే విషయం జిల్లా మొత్తం వ్యాపించడంతో అన్ని కార్యాలయాలు ఉలిక్కిపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ కొనసాగింది. నోషనల్ నెంబర్ తొలగించి ఖాతా నెంబర్ వేయనందుకు లంచం తీసుకోవడం వల్ల తహసిల్దార్‌పై కేసు నమోదు చేశారు. తహసిల్దార్‌ను రిమాండ్‌కు తరలించారు.

**కంప్యూటర్ తెలిస్తే కలెక్షన్.. కలెక్షన్ !**


తహసిల్దార్ బాలకృష్ణారెడ్డి ముత్తుకూరు మండలంలో విధుల్లో చేరిన రోజు నుంచి ఇప్పటివరకు కలెక్షనే కలెక్షన్.. ఉదయం 10 గంటలకు కార్యాలయం రావడం, నేరుగా తన ఛాంబర్‌కు వెళ్లడం, కంప్యూటర్ తెరవడం, కలెక్షన్ వసూలు చేసుకోవడం.. ఇదీ ఒక సిద్ధాంతంగా పాటించాడు. బాధితులు ఎవరైనా సరే, ఇక్కడ లంచం ఇవ్వాల్సిందే.. అనే విధంగా బోర్డు పెట్టకపోయినా ధర చెప్పేవాడు. పది వేల రూపాయల నుంచి 50 వేల రూపాయల వరకు లంచాలు తీసుకున్నాడు.

బాధితులు ఒక్కొక్కరుగా ఇప్పుడు చెబుతున్నారు. ప్రతిరోజు అక్రమ సంపాదనకు కేరాఫ్ అడ్రస్‌గా రెవెన్యూ కార్యాలయం మార్చేశారు. భూముల పరమైన సమస్యలుంటే ఆయనకు మహా సంతోషంగా ఉండేది. పెండింగ్ ఫైల్ అంటేనే ముందు దాన్ని ఓపెన్ చేస్తారు. ఫైల్ సక్రమంగా ఉంటే పెద్దగా ఆసక్తి చూపే అలవాటు తహసిల్దార్‌కు లేదు. ఎంతో మంది రైతులను ముప్పుతిప్పలు పెట్టిన తహసిల్దారు ఏసీబీ అధికారులకు పట్టు పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న కొంత మంది రైతులు ఆఫీసు వద్దకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఏసీబీ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేస్తామని అర్జీలు రాసుకున్నారు.

**పంటపాలెంలో కూడా ఇదేతంతు..!**

పంటపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులుగా పని చేస్తున్న వారు కూడా ఇదే తరహాలో ఉన్నట్టుగా విమర్శలున్నాయి. గ్రామస్థాయి నుంచి అవినీతి ప్రారంభమని తెలుస్తుంది. ఇక్కడ పనిచేస్తున్న అధికారులు కూడా ప్రతి పనికీ డబ్బులు వసూలు చేస్తున్నట్టుగా విమర్శలు లేకుండా పోలేదు. రైతులను దోచుకోవడం లక్ష్యంగా పని చేస్తున్నారు. గ్రామస్థాయిలో పనిచేసే గ్రామ సహాయకులు ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని సమాచారంగా ఉంది. ఏదైనా పనికి వెళ్తే.. వేలకు వేలు లంచం ఇవ్వాలని జనం అంటున్నారు. ఇక్కడ కూడా ఏసీబీ అధికారులు విచారణ చేస్తే.. ప్రజలకు న్యాయం జరుగుతుందని గ్రామస్తులు అంటున్నారు.

## పర్వత్ రెడ్డిని కలిసిన పలువురు నాయకులు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని రాంజీ నగర్‌లో 54వ డివిజన్ వైసీపీ నాయకులు వెంగళరెడ్డి 8వ డివిజన్ వైసీపీ నాయకులు ఆర్కే నగర్ కృష్ణారెడ్డి, 9వ డివిజన్ వైసీపీ నాయకులు శీను, వారి అనుచరులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసే దిశగా కలిసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి వారితో చర్చించారు.

## కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌తో ఎన్ఎంసీ కమిషనర్ భేటీ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు మెట్రో నగరాల అధ్యయనంలో భాగంగా కమిషనర్ సూర్యతేజ, హైదరాబాదులోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. అందులో భాగంగా మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను కమిషనర్ కలుసుకున్నారు. సమావేశంలో భాగంగా రోడ్ల నిర్వహణ, పార్కుల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, ఆస్తుల జి.ఐ.ఎస్ మ్యాపింగ్ వంటి వివిధ అంశాలను చర్చించారు. అనంతరం జగద్గిరి గుట్ట ప్రాంతంలోని గార్బేజ్ ట్రాన్స్ఫర్టేషన్ ప్లాంట్, జీడిమెట్ల ప్రాంతంలోని సిఅండ్‌డి ప్లాంట్ నిర్వహణలను కమిషనర్ సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రామ్మోహన్ రావు, ఈ.ఈ రహంతుజానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్




**విడవలూరు, మేజర్‌న్యూస్ :** సామాజిక సేవా కార్యక్రమాల చేసేందుకే విపిఆర్ ఫౌండేషన్ స్థాపించామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కోవూరు నియోజకవర్గంలోని బుచ్చిరెడ్డిపాలెం, కొడవలూరు, విడవలూరు, కోవూరు, ఇందుకూరుపేట మండలాలలో 107 మంది నడవలేని దివ్యాంగులకు మంగళవారం ఆమె ఎలక్ట్రికల్ ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. వీపీఆర్ ఫౌండేషన్ అనేది రాజకీయాలకు అతీతమైన సేవా సంస్థ అన్నారు. తాను రాజకీయాలలో రాక ముందు నుంచే విద్యా, వైద్యం, వికాసం, ఆధ్యాత్మిక రంగాలలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజాసేవ చేయడం కోసమే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో పాటు తానూ ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చామన్నారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా గ్రామాలలో పర్యటిస్తున్నప్పుడు పలువురు దివ్యాంగులు ట్రై సైకిళ్ళు కావా లని కోరారన్నారు. వారి అభ్యర్ధన మేరకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఆగస్టు 15న 40 మందికి బ్యాటరీతో నడిచే ఎలక్ట్రానిక్ ట్రై సైకిళ్ళు అందచేసినట్లు వివరించారు. అనంతరం ట్రై సైకిళ్ళు కావాలని పలు విజ్ఞప్తులు రావడంతో కోవూరు నియోజకవర్గవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఓ సర్వే నిర్వహిస్తే బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 26 మంది కోవూరులో 17మంది ఇందు కూరు పేటలో 32 మంది విడవలూరులో 27 మంది కొడవలూరులో 7 మంది నడ వలేక అవస్థలు పడుతున్న 107 మంది దివ్యాంగులను గుర్తించామన్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్ళు అందివ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇటీవల వీపీఆర్ ఫౌండేషన్ చేసే సేవా కార్యక్రమాలలో భాగంగా తిరుపతిలోని స్విమ్స్ వైద్యుల పర్యేక్షణలో కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 4,254 మందికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక దశలో వున్న దాదాపు 667 మందిని గుర్తించి ఉచిత వైద్య సేవలకై తిరుపతిలోని స్విమ్స్ హాస్పిటల్‌కు రెఫర్ చేయడం జరిగిందన్నారు.

కోవూరు నియోజకవర్గంలో గత ఇరవై ఏళ్లుగా పూడికలు తీయని సాగునీటి కాలువలలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాగునీటి కాలువలలో పూడిక తీసే పనులు చేపట్టడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభత్వ పథకాలలో సైతం ఎటువంటి వివక్షకు తావు లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. దివ్యాంగుల పెన్షన్ 3 వేల నుంచి 6 వేలకు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు కృతజ్ఞతలు తెలియజేసారు. అభివృద్ధి సంక్షేమాన్ని సమపాళ్లలో చేయగల సమర్ధత చంద్రబాబు నాయుడుకే ఉందని ముఖ్యమంత్రిని ప్రశంసలతో ముంచెత్తారు. కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, బుచ్చి టీడీపీ అధ్యక్షులు ఎంవీ శేషయ్య, అడపాల అనీష్ రెడ్డి, కోవూరు టీడీపీ అధ్యక్షులు ఇంతా మల్లారెడ్డి, టీడీపీ రాష్ట కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, కొడవలూరు టీడీపీ అధ్యక్షులు అమరేంద్ర రెడ్డి, ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షులు వీరేంద్ర నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీరెడ్డి, ముంగమూరు శ్రీహరి రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకు కిషోర బాలికల వికాసం అత్యంత ఆవశ్యం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** సమాజ శ్రేయస్సుకు కిశోరి బాలికల వికాసం అత్యంత ఆవశ్యమని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావు అన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కిశోరి బాలికల వికాసం జిల్లాస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అధికారులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావు మాట్లాడుతూ ఆడపిల్లలకు 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు అత్యంత విలువైనదని, ఈ సమయంలో వారు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు, సమాజం పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా డిఆర్ఓ చెప్పారు. సోషల్ మీడియా, సినిమాల ప్రభావం బారిన పడకుండా ఆడపిల్లలను సమాజంలో అన్ని రంగాల్లో రాణించేందుకు నిర్దిష్ట లక్ష్యాల వైపు వారిని నడిపించాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లల భద్రత, రక్షణకు అందరూ సమష్టిగా కృషి కృషి చేయాలన్నారు. ఇతర వ్యాపకాల పట్ల ఆకర్షితులు కాకుండా సమాజంలో జరుగుతున్న దుష్పరిణామాలను, మంచి చెడులను వారికి వివరించాలని సూచించారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి హేనా సుజన్ మాట్లాడుతూ.. ఐసిడిఎస్, మెప్మా, డిఆర్‌డిఏ సిబ్బంది అందరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో ఆడపిల్లలకు పరిపూర్ణంగా అన్ని విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై కూడా వారిని అప్రమత్తం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క బాలిక కూడా ఉన్నత విద్య వైపు అడుగులు వేసేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో బాలికలకు అవగాహన కల్పిస్తూ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం గిరిజన బాలికలు విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఇది అందరి బాధ్యతగా ఆమె అన్నారు. డిఆర్‌డిఏ పిడి నాగరాజు కుమారి మాట్లాడుతూ.. మన ఇంటి నుంచే బాలికలను ప్రోత్సహించాల్సిన ప్రక్రియ మొదలు కావాలన్నారు. బాలికలతో స్నేహపూర్వక వాతావరణంలో మెలగాలని, పాఠశాల, కళాశాలలో జరిగే అన్ని విషయాలను వారి నుంచి తెలుసుకొని తదనగుణంగా ఏ విషయాన్ని అయినా నిర్భయంగా బాలికలు చెప్పేలా వారిని తయారు చేయాలని సూచించారు. 18 ఏళ్లలోపు ఆడపిల్లల శరీరంలో అనేక మార్పులు జరుగుతాయని, వారికి మంచి పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ పెంచలయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ రావు, మెప్మా పిడి రాధా, సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు, ఐసిడిఎస్, డిఆర్‌డిఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు



**కావలి, మేజర్‌న్యూస్ :** ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా కావలి కావాలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్, పురపాలక జే.భారతి ఆధ్వర్యంలో వివిధ రకాల విభిన్న ప్రతిభావంతులకు క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం పోటీలలో విజయం సాధించిన వారికి వివిధ రకాల బహుమతులను కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ద్వారా అందజేశారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులు వారి హక్కులను సక్రమంగా వినియోగించుకోవాలని ఆడ, మగ వివిధ రకాల విభిన్న ప్రతిభావంతులు పొదుపు సంఘాలలో చేర్చి వారి సంఘాలకు రుణ సదుపాయాన్ని పొందాలని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో మీరు కూడా భాగస్వాములై వారికి కేటాయించిన వాటిని వినియోగించుకోవాలని, మరిన్ని రుణాలు పొంది అభివృద్ధి చెందేందుకు సహకరించి బలోపేతం అవ్వాలని తెలిపారు. అంతేకాకుండా మెప్మా సిబ్బంది మీకు అండగా ఉంటారని తెలిపారు. మదర్ థెరిస్సా విభిన్న ప్రతిభావంతుల సమాఖ్యను బలోపేతం చేసి విభిన్న ప్రతిభావంతులు ఎదుగుదలలో ఎప్మా సిబ్బంది ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందని, అలాగే మదర్ తే రిస్సా వివరణ ప్రతిభావంతుల సమాఖ్య పొదుపులు సక్రమంగా కట్టుకుంటూ ప్రతి నెల సమాఖ్య సమావేశాలు నిర్వహిస్తుందని తెలిపారు. కమ్యూనిటీ ఆర్గనైజర్లు కిరణ్ కుమార్, శైలమ్మ, రీనా, ఎలిజిబెత్, లక్ష్మీప్రసన్న, సునీత కంప్యూటర్ ఆపరేటర్ బైరాగిరెడ్డి, కాజా రంతుల్లా, విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు.

## తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ జయంతి



**కావలి, మేజర్‌న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధులు, తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్ర ప్రసాద్ ప్రజా ప్రతి నిధులకు ఆదర్శ ప్రాయుడు అని లోక్ అదాలత్ మెంబర్ మాలకొండ రెడ్డి తెలిపారు. మంగళవారం కావలి పట్టణంలోని నారాయణ ఉన్నత పాఠశాల అవరణంలో కీర్తి శేషులు మాజీ రాష్ట్రపతి, భారత రాజ్యాంగ పరిషత్ చైర్మన్ డా. బాబు రాజేంద్ర ప్రసాద్ 140 జయంతి వేడుకలను ఘనంగా నిర్వించారు. నారాయణ ఉన్నత పాఠశాల ఏజీఎం భాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో మొదటిగా రాజేంద్ర ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు రాజేంద్ర ప్రసాద్‌ను స్ఫూర్తిగా తీసుకోనీ దేశ భక్తి దేశభక్తిని పెంపొందించుకొని ఆయన మార్గములను విద్యార్థులు నడవాలని కోరారు. ఈ కార్యమంలో ప్రిన్సిపాల్ రాజేష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జలదంకిలో ట్రాఫిక్ కష్టాలు

### ● ప్రజలు వాహనాచోధకులు అవస్థలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** ట్రాఫిక్ సమస్యతో జలదంకి వాసులు కష్టాలు పడుతున్నారు. స్థానిక జలదంకి బస్టాండ్ సెంటర్‌లో షాపులు ముందే బైకులు పెట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. జలదంకి నుంచి కడపకు, కావలి వెళ్లే భారీ వాహనాలు వల్ల నిత్యం ట్రాఫిక్ స్తంభించి పోతుంది. ఉదయగిరి వైపు వెళుతున్న కార్లు, లారీలు, కావలి వైపు వెళ్తున్న బస్సులు తదితర వాహనాలు వెళ్లేందుకు జలదంకిలోని షాపుల ముందు బైకులు ఉండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది. పోలీసులు చూచి చూడనట్లు ఉండడంతో షాపుల దగ్గర రోడ్డు మీదే బైకులు పార్క్ చేయడంతో ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండాచర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు వేడుకుంటున్నారు.



## దివ్యంగులను ప్రోత్సాహిస్తే ఉన్నత శిఖరాలకు




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దివ్యంగులను ప్రోత్సాహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీపీ పాఠశాలలోని భవిత సెంటర్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యంగులను ప్రేమతో చూడాలని ఓర్పుతో చదువు నేర్పాలన్నారు. అనంతరం ఆటలపోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ షబ్బీర్, స్పెషల్ ఎడ్యుకేటరు ఎన్.రమణ, రామకృష్ణ, నరసింహ, ఐఆర్పీలు శివ, నందిని, సుభాష్, చంద్రబోస్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ పోలీసుల దాడులు

### ఇద్దరు అరెస్టు, 29 మద్యం సీసాలు స్వాధీనం



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని రెండు ప్రాంతాల్లో వన్ టౌన్ ఎక్సైజ్ ఎస్ఐ మురళి కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ట్రైలర్ కాలనీ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న షేక్ మహబూబ్ బాష అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 14 మద్యం సీసాలను, కొత్త కాలువ సెంటర్ వద్ద తుమ్మల కార్తిక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుండి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ కమీషనర్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అక్రమ మద్యం తరలింపు, బెల్టు షాపులపై నిరంతరాయంగా దాడులు ఉంటాయన్నారు. ఈ దాడులలో ఎన్ఫోర్స్మెంట్, ఎక్సైజ్ సూపెరెండెంట్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్మవారిపల్లిలో పొలం పిలుస్తుంది



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని కమ్మవారిపల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నటువంటి రైతులకు ముఖ్యంగా నిమ్మ మొక్కల్లో వచ్చే వివిధ రకాల తెగుళ్లు వాటి నివారణ చర్యలు గురించి మండల వ్యవసాయ అధికారి హైమావతి నిమ్మ మొక్కల వచ్చే గజ్జి తెగుళ్లు తట్టుకునే రకాలైన బాలాజీ, పెట్లూరు రకాల్ని ఎంచుకోవాలని తెలియజేశారు. గజ్జిని నివారించుటకు స్ట్రెప్టోసైక్లిన్ ప్లాంటోమైసిన్ తగిన మోతాదులో పిచ్చిగారి చేసినట్లయితే తెగులును నివారించవచ్చని తెలియజేశారు. అదేవిధంగా వరి పలు రకాల పంటలపై రైతులకు అవగాహన కలిగిస్తూ పలు సూచనలు సలహాలు తెలియజేశారు.

## 14 అడుగులకు చేరిన నీటిమట్టం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయంలో 14 అడుగులకు నీటిమట్టం చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి మంగళవారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తుందన్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులు కాగా గతంలో 12 అడుగులు ఉన్న నీటిమట్టం ప్రస్తుతం 14 అడుగులకు చేరినట్లు ఆయన తెలిపారు.

# ఐఎంఏ అవార్డు గ్రహీతలకు రెడ్‌క్రాస్ సత్కారం



**కావలి, మేజర్‌న్యూస్ :** ఇటీవల కాలంలో గుంటూరులో జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశంలో మూడు విభాగాలలో అవార్డులు సాధించిన కావలి ఐఎంఏ ప్రతినిధులను రెడ్‌క్రాస్ భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ.. కావలి ఐఎంఏ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ శాఖ, ఉత్తమ కార్యదర్శి, ఉత్తమ సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహించిన శాఖ విభాగాలలో అవార్డులు సాధించిందని అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 24 గంటలలో 1274 యూనిట్ల రక్తం సేకరించడంతోపాటు, అనాధ పిల్లల చదువులకు సహకరించడం, ఉచిత వైద్యశిబిరాల నిర్వహణ తదితర కార్యక్రమాల వలన ఈ అవార్డులు సాధించబడడం, జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక కావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ వి.గోపి, కోశాధికారి డాక్టర్ పి.శివప్రసాద్, డాక్టర్ సతీష్, డాక్టర్ ఉషారాణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు సుబ్బారావు, గోపి, శివప్రసాద్‌లు మాట్లాడుతూ.. ఈ అవార్డులను కావలి ప్రజలకు, తమకు ఎల్లప్పుడూ సహకరించే రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్, జన విజ్ఞాన వేదిక తదితర సంస్థలకు అంకితమిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ సతీష్ దంపతులు మాట్లాడుతూ.. కావలిలో రక్తకేంద్రం లేనప్పుడు తమ వద్దకు వచ్చిన గర్భిణీ స్త్రీలను, రోగులను కాపాడడానికి అనేక ఇబ్బందులకు గురయ్యేవాళ్ళమని, కావలిలో రెడ్‌క్రాస్ రక్తకేంద్రం ఏర్పాటు తరువాత రక్తం పుష్కలంగా లభ్యమౌతుందని అన్నారు. కావలి లాంటి చిన్న పట్టణంలో తలసేమియా ఆసుపత్రి ఏర్పాటుకు రెడ్ క్రాస్ పూనుకోవడంతో తమ వంతు సహకారం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముందుగా రెడ్‌క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్లో రక్తమార్పిడి చేయించుకుంటున్న చిన్నారులకు సన్మానగ్రహీతలు చేతుల మీదుగా మందులు, పౌష్టిక ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరి రెడ్డి, తలసేమియా డే కేర్ సెంటర్ కన్వీనర్ కె.హరినారప రెడ్డి, ప్రధానదాత రమేష్ రెడ్డి, సబ్ కమిటీ సభ్యులు కల్లయ్య, నందనవనం సీతాలక్ష్మి, జమున, పసుపులేటి సాయికుమార్, షణ్ముఖ్, వైష్ణవి, రోటరీక్లబ్ అధ్యక్షురాలు స్వర్ణలత, రొటేరియన్లు డాక్టర్ కె.మాధవరెడ్డి, నల్లూరు రవికుమార్, గోపిక్రిష్ణ, రెడ్‌క్రాస్ సిబ్బంది బియస్ ప్రసాద్, ఐ.రాజశేఖర్, పద్మావతి, శేషమ్మ, వల్లూరమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత నమోదులో దూసుకుపోతున్న కావలి నియోజకవర్గం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మేరకు కావలిలో ఉన్న ప్రతి వార్డు, రూరల్ ప్రాంతాల్లో ఉన్న ప్రతి గ్రామం తెలుగుదేశం పార్టీ సభ్యత్వంలో ఒక ప్రభంజనాన్ని సృష్టిస్తుందని చెప్పవచ్చు. ఎందుకంటే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు రాష్ట్రంలో పార్టీ సభ్యత నమోదు కార్యక్రమంలో నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి ఏ విధంగా ముందుకు వెళుతుందో అదే విధంగా తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు జరుపుకోవడం విశేషం. కావలి నియోజకవర్గంలో ఉన్న ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త సభ్యత నమోదు కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని అహర్నిశలు కృషి చేస్తూ సభ్యత్వంలో పాల్గొన్న వ్యక్తులకు తెలుగుదేశం పార్టీ అందిస్తున్న భీమాల గురించి చెప్పి వారిని తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకునే విధంగా ప్రజలను ఆకర్షించులుగా చేయడం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పాత్ర గణనీయంగా ఉందనడంలో ఎంతో అతిశయోక్తి లేదు భారతదేశంలోనే జాతీయ పార్టీగా అత్యంత శక్తివంతమైన ప్రాంతీయ పార్టీ తెలుగుదేశం పార్టీ తన ప్రస్థానాన్ని మొదటి నుంచి ఆధిపత్యం చాటుచూ, ఉన్న నేపథ్యంలో మరింత బలీయమైన శక్తిగా మార్పు చెందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలుగుదేశి తెలుగుదేశం పార్టీ శ్రేణులకు తగు సూచనలు అందిస్తున్నారు.

# దివ్యాంగులకు బహుమతులు అందజేసిన ఎంపీడీఓ



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** దివ్యాంగులకు అండగా నిలిచి, వారిలోని సామర్థ్యాలను వెలికి తీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీవో ఎం.శ్రీహరి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులలో దాగివున్న నైపుణ్యాన్ని, ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్నారు. భవిత కేంద్రాన్ని పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సందర్శించి టాయిలెట్ లేదని తెలుసుకొని కట్టిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా, పనులు నేటినుండే ప్రారంభించమని చెప్పడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. దర్శి లక్ష్మీనరసయ్య జ్ఞాపకార్థం దర్శి బాల నరసింహారావు, శిరీష దంపతులు స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేయడం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేసినందుకు మండల విద్యాశాఖ అధికారి ఎం.దిలీప్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా కమిటీ మాజీ చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి, వవ్వేరు బ్యాంకు మాజీ అధ్యక్షులు సూరా శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షులు మన్నేపల్లి శ్రీనివాసులు, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, సహిత విద్య ఉపాధ్యాయులు శేషమ్మ, శ్రీనివాసులు రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు తిరివీది సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మస్తాన్ బాబు, కోశాధికారి సరాబు వెంకట నాగేశ్వరరావు, సభ్యులు సోము రామచంద్రారెడ్డి, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతు డిపోలలో ఆకస్మిక తనిఖీ



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం లోని గొలగమూడి అనికేపల్లిలో ఎరువులు దుకాణాలను ఆకస్మికంగా మండల వ్యవసాయ అధికారి తనిఖీ చేశారు. దుకాణములలోని ఎరువుల కొనుగోలు, అమ్మకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఎరువులను గరిష్ఠ చిల్లర ధరకు మించి అమ్మరాదని, ఎవరైనాను నిబంధనలను ఉల్లంఘించి ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపిన యెడల చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.శ్రీనివాసులు సహాయ వ్యవసాయ సంచాలకులు (నియమిత), నెల్లూరు, డి.హరి కరుణాకర్ రెడ్డి మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## వర్షాలు తగ్గాక నాట్లు వేసుకోండి




**విడవలూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం జోరు వర్షాలు కురుస్తున్న కారణంగా అవి తగ్గుముఖం పట్టాక రైతులు వరినాట్లు వేసుకోవాలని కోవూరు వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు సుజాత సూచించారు. మండలంలోని పార్లపల్లి విడవలూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాట్లాడుతూ.. వరినాట్లు వేసిన రైతులు వర్షాల నుంచి సంరక్షించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా పొలాల్లో నిలిచిన వర్షపు నీరును త్వరితగతిన బయటకు పంపాలని సూచించారు. పంట రుణాలను పొందని రైతులు పంట బీమాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వవ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య, రైతులు పాల్గొన్నారు.

## అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా లెప్రసి ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ షేక్ ఖాదరవల్లి రైతు బజార్ రోడ్డు ఎన్టీఆర్ నగర్, అల్లిపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో జరిగే ఆషాడే కార్యక్రమానికి మంగళవారం హాజరు అయ్యారు. ఈ ఆషాడేలో భాగంగా అడిషనల్ డిఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అర్బన్ హెల్త్ సెంటర్లో లో జరిగే ప్రెసెంట్ టీబి ఎగ్జామినేషన్ని టీబి నోటిఫికేషన్‌ని, టిబి కార్డ్స్ నీ సక్రమంగా నిర్వహించాలి. దీనికి సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ సెంటర్ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీబి నివారణ సిబ్బంది పీహెచ్ యూపీహెచ్ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## గంగిరెడ్డిపల్లిలో పొలం పిలుస్తుంది



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏవో ఆంజనేయ నాయక్ ప్రారంభించారు వరి పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా పెంగల్ తుఫాన్ ద్వారా ఏర్పడినటువంటి వర్షాలను గుర్తుంచుకొని వరి పొలాల్లో వివిధ యాజమాన్య పద్ధతిలను పాటించాలని మరియు వరి పొలాలను సందర్శించి పరిశీలించగా వాటికి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా ఉదయగిరి మండలంలో అన్ని గ్రామాలలో వరి, మినుము పంటలు వేసినటువంటి రైతులు గ్రామ స్థాయి రైతు సేవ కేంద్రం సిబ్బంది వద్దకు వెళ్లి ఏరియా సోన్ సర్టిఫికెట్ తీసుకొని ప్రధానమంత్రి పసల్ బీమా యోజన ద్వారా ఇన్సూరెన్స్ చేపించుకోవాలని తెలియజేయడం జరిగింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కొరకు మీసేవ సిఎస్‌సి సెంటర్ నందు లేదా రైతు సేవ కేంద్రాలు లేదా రైతులు సెల్ఫ్ ఎన్రోల్మెంట్ ద్వారా అప్లై చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నందు వరికి 420 రూపాయలు ఈనెల 31వ తేదీ చివరి రోజు, మినుము పంటకు 95 రూపాయలు ఈనెల 15వ తేదీ చివరి రోజుగా ఉన్నది.. పెంగాల్ తుఫాన్ కారణంగా పడినటువంటి వర్షాలకు దెబ్బతిన్నటువంటి పంట పొలాలను గ్రామస్థాయి వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని తెలిపారు.

# పేరెంట్, టీచర్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేరెంట్– టీచర్ కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులకు సూచించారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పేరెంట్ టీచర్ మీటింగ్‌కు పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. పిల్లలతో ఆహ్వానాలు పంపించడంతోపాటు ఉపాధ్యాయులు, వార్డెన్లు ఎస్ఎంఎస్ లు, ఫోన్లు ద్వారా సమాచారం అందించి తప్పనిసరిగా హాజరయ్యే విధంగా కోరావలన్నారు. అలాగే పూర్వ విద్యార్థులను, ప్రజా ప్రతినిధులను కూడా ఆహ్వానించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఈ నెల 5వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలన్నారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ఈఓపీఆర్‌డీలు చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థులతో కమిటీని ఏర్పాటు చేసుకుని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశాల వల్ల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య సంబంధాలు బలపడతాయని, విద్యాభివృద్ధిలో సమాజం



కీలకం కావాలని కలెక్టర్ అన్నారు. పేరంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేసి తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. తొలుత డీఈవో ఆర్ బాలాజీ రావు పేరెంట్ టీచర్ మీటింగుకు సంబంధించి జిల్లాలోని పాఠశాలల్లో చేపడుతున్న ఏర్పాట్లను కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఉదయ భాస్కరరావు సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు, పిడి డిఆర్డిఏ నాగరాజ కుమారి, సీఈవో విద్యారమ, ఆర్ఐఓ శ్రీనివాసులు, డిపిఓ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేపై అవగాహన



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వేపై ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.పెంచలయ్య అడిషనల్ డిఎంహెచ్ఓ ఎస్.కె ఖాదరవలి, బిఎల్ఎటి ఓ, డీఎంవో ఈ.హుస్సేనమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో డిఎంఓ మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్స్ ఫైలేరియా పరీక్షా విధానంలో చేయవలసిన వివిధ పద్ధతుల గురించి విపులంగా తెలియజేశారు. వారు ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే రక్త పరీక్షలను క్వాలిటీగా నిర్వహించి ఫలితాలను సరియైన పద్ధతిలో అందించ వలయునని తెలియజేశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ.. ఫైలెరియా, క్షయ వ్యాధి మలేరియా, డెంగ్యూ ఇతర పరీక్షలను సకాలంలో నిర్వహించి సరియైన ఫలితాలను రాబట్టాలని

ఫైలేరియా నైట్ బ్లడ్ సర్వే డిసెంబరు 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు పూర్వపు నెల్లూరు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 20 సంవత్సరముల వయస్సు పైబడిన వారికి రక్త నమూనాలను సేకరించి బోధ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన చికిత్స అందజేయుటకు వ్యాధి యొక్క తీవ్రతను వ్యాప్తి చెందు విధానాన్ని అరికట్టవచ్చని తెలియజేశారు. అందరూ సకాలంలో విధులకు హాజరై బాధ్యతగా విధులు నిర్వహించాలని కోరారు. అనంతరం జిల్లా అదనపు వైద్యాధికారి డీఎల్ఏటీఓ మాట్లాడుతూ అనుమానిత క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ల్యాబ్ టెక్నీషియన్స్ సరియైన పద్ధతిలో కళ్ళే పరీక్షలను నిర్దేశిత లక్ష్యాల ప్రకారం నిర్వహించి రికార్డులను సక్రమంగా పూర్తి చేసి నివేదికలను అందజేయాలని సూచించారు. క్షయ వ్యాధి చాలా ప్రమాదకారి కావున పరీక్షలు నిర్వహించి పాజిటివ్ కేసులను గుర్తించితే వ్యాధిగ్రస్తులకు సకాలంలో చికిత్స అందించవచ్చునని క్షయ వ్యాధి వ్యాప్తిని తద్వారా అరికట్టవచ్చని తెలియజేశారు.అనంతరం ఏఎంఓ వి.నాగార్జున రావు మాట్లాడుతూ.. ల్యాబ్ టెక్నీషియన్స్ చేతిలోనే వివిధ రకాల రక్త పరీక్షల ద్వారా వ్యాధులు నిర్ధారింపబడతాయని తద్వారా ప్రజలకు చికిత్స వైద్యుల ద్వారా అందజేసే అవకాశం కలుగుతుందని ఈ శిక్షణలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉత్తమ ఫలితాలను అందించి జిల్లాలో ఫైలేరియా, ఇతర వ్యాధులు వ్యాధులు ప్రబలకుండా చూడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా, ఫైలేరియా సిబ్బంది సూపర్వైజర్లు సబ్ యూనిట్ అధికారులు, పూర్వపు నెల్లూరు జిల్లా ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జలదంకి లోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య



అతిథులుగా జలదంకి తహసిల్దార్ ప్రమీల, విద్యాశాఖ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ప్రమీల మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల ప్రేమ, అనురాగం, శ్రద్ధ ప్రోత్సహం, చూపించాలని ఆమె కోరారు. దివ్యాంగులు మండలంలో 90మంది వరకు ఉన్నారని జలదంకి పంచాయతీలో 20 మంది దివ్యాంగులు ఉన్నట్లు వారందరికీ కూడా ప్రభుత్వం నుంచి అలివెన్సెస్ ప్రొవైడ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా చింతలపాలెం గ్రామానికి చెందిన నేలపాటి భానుతేజ అనే దివ్యాంగుడకు ఎంపీడీవో బ్రహ్మయ్య సహాయ సహకారాలతో వీల్ చైర్ అందించినందుకు అభినందనలు తెలియజేశారు. జలదంకి గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగులైన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యను అభ్యసించడం జరుగుతుందని ఉపాధ్యాయుడు ఒంగోలు శ్రీకాంత్ తెలిపారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేత దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సిహెచ్ మమత, ప్రధానోపాధ్యాయులు ఇమ్మానియేల్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలన



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** ఫెంగల్ తుఫాను వలన గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న వరి, శనగ పంటలను వ్యవసాయ శాఖ రవికుమార్ ,సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు తగు సూచనలు తెలియజేయడం జరిగిందని తెలిపారు. మంగళవారం వరికుంటపాడు మండలంలో జి.కొండారెడ్డిపల్లి, కొండ్రాజు పల్లి గ్రామాలలో కోత దశలో ఉన్న వరి పైరుతోపాటు విరువూరు గ్రామంలో గత వారంలో నాటిన శనగ పంట దెబ్బతిన్నట్లు గుర్తించామని వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల నుంచి సేకరించిన పంట నష్ట వివరాలను సేకరించి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం జరిగిందని తెలిపారు. వర్షాలు ఆగిన వెంటనే వరి, శనగ పంటలకు అధిక తేమ తెగుళ్ల నివారణ కొరకు 13-0-45 పొటాషియం నైట్రేట్ ఒక కేజీ ఎరువు మందుతోపాటు హెక్సకోనజోల్ అనే శిలీంద్ర నాశని ముందును 400 మిల్లీలీటర్లు ఒక ఎకరానికి నీటితో కలిపి పంటపై పిచికారి చేసుకున్నట్లయితే పంట తెగుళ్లను నివారించుకోవచ్చు అని తెలిపారు.

## పారిశుద్ధ్యంపై పంచాయితీ అధికారుల దృష్టి



**సైదాపూరం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీలో మంగళవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలో వర్షాలకు నీరు కొన్నిచోట్ల నిలువ ఉండడం వల్ల మురికిగా తయారై వాటిపై దోమలు ఈగలు వాలుతూ ఉన్నాయని వాటి వల్ల అనారోగ్య సమస్యల తలెత్తయని పలు కార్యక్రమాలపై సైదాపురం పంచాయతీ సర్పంచ్ ఏందోటి శారద, ఉప సర్పంచ్ బులిగర్ల శివ పంచాయతీ కార్యదర్శి ఇంద్రాణి పంచాయతీ పట్ల పారిశుద్ధ్య లోపాలు ఎక్కడున్నాయో వాటిని పరిశీలించి మురికిగా ఉన్నటువంటి ఏరియాలలో బ్లీచింగ్ వేస్తూ పరిసరాలను శుభ్రపరచడం జరిగిందని తెలిపారు.

## అర్హులైన లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు అర్హతలను పునఃపరిశీలించాలని అదనపు కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. మెప్మా విభాగం అధికారులు, హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు, నగరపాలక సంస్థ హౌసింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశాన్ని కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం అమలులో భాగంగా అర్హులైన లబ్ధిదారులకి గృహాలను అందించాలని సూచించారు. లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను పునఃపరిశీలించి, సంబంధిత బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ దయాకర్, నెల్లూరు డివిజన్ ఈఈలు, నెల్లూరు సిటీ, రూరల్ ఏఈలు, నగర పాలక సంస్థ వార్డు అమెనిటీ కార్యదర్శులు, సిఎల్‌టిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ తనిఖీలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జిల్లా విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం



సమగ్రమైన తనిఖీలు చేసింది. సుమారు గంటపాటు అధికారులు తనిఖీలు నిర్వహించారు. పరిపాలనపరమైన అంశాల పైన రికార్డు తనిఖీ జరిగిందని మండల ప్రజా పరిషత్ ఉన్నతాధికారులు చెప్పారు.

## ట్రేడ్ యూనియన్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

**బోగోలు, మేజర్‌న్యూస్ :** నేటి నుండి దక్షిణ మధ్య రైల్వేలో రైల్వే ట్రేడ్ యూనియన్ల (సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిూస్ సంఘ్) ఎన్నికలు నేటి నుండి 6'వ తేదీ వరకు జరగనున్నాయని బిట్రగుంట ఎస్ఐ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఎం.మహేంద్రబాబు తెలిపారు. దీనికి సంబంధించి, బిట్రగుంట రైల్వే స్టేషన్‌ను బూత్ నంబర్ 15గా కేటాయించినట్లు తెలిపారు. ఓటింగ్‌కు స్థలం సిసిసి/ఆఫీస్/బిట్రగుంట రైల్వే స్టేషన్. ఈ ఎన్నికలలో, బిట్రగుంట రైల్వే స్టేషన్‌లోని రన్నింగ్ స్టాఫ్ (ఏఎల్ పి/టిఎంఆర్)తో సహా మొత్తం 850 మంది రైల్వే ఉద్యోగులు పాల్గొని, 4వ తేదీ నుండి 6వ తేదీ వరకు ఎన్నికలు జరగనున్నాయని ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6గంటల మధ్య ఉద్యోగస్తులు తమ ఓటు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ విషయంలో ట్రేడ్ యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలో ఎటువంటి అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకోకుండా ఉద్యోగ సంఘాలు తగు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.

# నెల్లూరు రూరల్‌లో అభివృద్ధి పనుల జాతర

- అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతాం
- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజలందరి ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జాతర మొదలైందని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు శాసనసభ్యుడిగా కృషి చేస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, ఏవికే. ఎస్టేట్‌లో 32లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు నిధులు అడిగినా ఇచ్చే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత అభివృద్ధి పనుల జాతర నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రారంభమైందన్నారు. పేద, మధ్య తరగతి, సామాన్య కుటుంబాలు అధికంగా నివశించే ప్రాంతమని ఆయన న్నారు. ప్రజలందరి ఆశీస్సులతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభి వృద్ధి పథంలో రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చి దిద్దేందుకు శాసనసభ్యుడిగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, తెలుగుదేశం పార్టీ నాయకులు కుకాటి హరిబాబు యాదవ్, యానాదయ్య, జమీర్, అషిక్ ఆలీ ఖాన్, విఘ్నేశ్వర రావు, ఓబుల్ రాజు, విజయ్ రెడ్డి, తురక కృష్ణ, తురక ఆనందరావు, ఖాజా, శేషయ్య, రాముడు, లక్ష్మణుడు, అయ్యప్ప, శేషారెడ్డి, అజయ్, సురేష్, విజ యమ్మ, కృష్ణవేణి, మహేష్, నాగేశ్వరరావు, వంశీ, ఢిల్లీ, ఆనంద్ రావు, మస్తాన్, మున్నా, మనోహర్, రమణయ్య, దుర్గ, అఫీద్, అరిఫా, షాహిన, జనసేన నాయకులు కరీమ్, వెంకటేశ్వర్లు విజయ్ కృష్ణవేణిలు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు సీఎం అండగా ఉంటారు : ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నిరుపేదలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడూ అండగా ఉంటారని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం ఆయన తన నివాసంలో అందించారు. నెల్లూరు నగరానికి చెందిన చెంబేటి అనిల్ బాబు అనే వ్యక్తికి 1 లక్ష 43 వేలు, చంద్రశేఖర్ అనే వ్యక్తికి సంబంధించి 98వేల రూపాయల విలువైన చెక్కులను సదరు లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. లబ్ధిదారుల సమస్యలపై వెనువెంటనే స్పందించి చెక్కులు రిలీజ్ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా బాధితులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆపదలో ఆదుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కుండపోత వర్షం..

- నీట మునిగిన రోడ్లు.. ట్రంక్ రోడ్డు జలమయం
- కోటమిట్ట ప్రధాన రహదారి మొత్తం నీరే..
- యడ్లవారీ విధి తిప్పరాజు వారివిధిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు వేసేస్తున్నాం.. అంతా క్లిన్ అంటున్న నేతలు ఒక్కసారి వర్షం కురిస్తే ఎలా ఉందో మంగళవారం ఉదయం నుంచి రెండు దఫాలు కురిసిన వర్షం ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. అటు స్టోన్హౌస్ పేట ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రీజ్ క్రిందకు పెద్ద ఎత్తున నీరు చేరుకొని ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇక ట్రంక్ రోడ్డులో వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచి పోయింది. నగరం నడిబొడ్డు గాంధీ బొమ్మ సర్కిల్, శివాజీ సెంటర్‌లో వర్షం కురిస్తే నీరు పోయో మార్గం లేకుండా దుకాణ దారులు కాలువలు పూర్తిగా మూసి వేసి ఇంకా ముందుకు వచ్చి వ్యాపారం చేస్తున్నారు. కురిసిన వర్షం నిరూపోయోందుకు కనీసం చాలా మంది ఒక రంధ్రం కూడా పెట్టడం లేదు. ఇదంతా కళ్ల ముందు నడుస్తున్న కార్పొరేషన్ వారు నిద్ర నటిస్తున్నారని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. టౌన్ ప్లానింగ్ వారికీ ముడుపులు ఇస్తే చాలు ఏదైనా నిర్మించుకోవచ్చు అనేది సత్యం. ఇందుకు సాక్ష్యం నగరంలోని కాలువ లకబ్జలే. ఏదో అభివృద్ధి చేసేస్తున్నామని ఆక్రమణలు సహించామని నిత్యం ప్రకటించే నేతలు.. మాటలు ఇక్కడ నెల్లూరు కార్పొరేషన్‌లో అమలుకు నోచుకోని పరిస్థితి. ఇది ఒక అధికార పార్టీ నేత చెబుతున్న మాట. భవిష్యత్‌లో వరదలు వస్తే నగరం కొద్దిరోజులు నీటిలో ఉండాల్సిన పరిస్థితి తప్పదా?

# వర్షం.. రైతుకు అపారనష్టం..





**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పెంగల్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్గాలకు కర్షకులు కలవరం చెందుతున్నారు. మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలు, రబీ సీజన్లో ముందస్తుగా వేసిన పంటలకు వర్షం దెబ్బతీస్తోంది. సబ్ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన వరి పంట కోత దశకు వచ్చింది. కొద్ది రోజుల్లో పంట కోత కోసి దిగుబడికి ఇంటికి చేరుతుంది. ఈ తరుణంలో ఆల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్గాలకు పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. అలాగే పూత, పిందె దశల్లో ఉన్న మినుము. కంది పంటలో నీరు చేరడంతో పంట దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే నేలకొరిగిన ఆయా పంటల గింజ మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. దుత్త లూరు మండలంలో రైతులు ఇటీవల 330 హెక్టార్లలో పచ్చిశనగ పంట సాగు చేశారు. వర్గాలకు చేలల్లో నీరు చేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

## వైభవంగా రాహుకాల పూజలు..



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వైభవంగా రాహుకాల పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సతీమణి సుజిత, స్థానిక కార్పొరేటర్ కువాకొల్లు విజయలక్ష్మిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాహుకాల పూజలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు హాజరయ్యారు. మహిళలు కోలాటలతో సాంస్కృతిక కార్ర్యమాల్లో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరికృష్ణ తదితరులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా దగ్గర ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి చైతన్య, శ్రీనాధ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తపాలా సేవలను మెరుగుపర్చండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తపాలా సేవలను మెరుగుపరుస్తూ ఉద్యోగు లకు కేటాయించినల క్ష్యాలను అధిగమించాలని నెల్లూరు పోస్టల్ సూపరిం టెండెంట్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయగిరి పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికి బీమా సౌకర్యం కల్పించేలా సిబ్బంది. చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగులకు కేటాయించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రజలతో మమేకమై పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. లక్ష్యాలు అధిగమించని ఉద్యోగులు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. అనంతరం లక్ష్యాలు అధిగమించిన ఉద్యోగులకు వెండి నాణెములు, బ్యాగ్లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఐపీవో వేగూరు సాయికృష్ణారెడ్డి, ఎస్‌పీఎంలు, బీపీఎంలు, జీడీఎస్‌లు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను మంత్రి ఆకస్మిక తనిఖీ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలంలోని కప్పరాల తిప్ప జాతీయ రహదారి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబే ద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠ శాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ఇటీవల గురుకుల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని ప్రవళికను పాము కాటు వేయడంతో పాఠశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విధ్యార్థినులతో కలిసి భోజనం చేసిన పాఠశాల తలపై విద్యార్థుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీటి శాశ్వత పరిష్కారం తోపాటు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని పాఠశాల ఆవరణంలో ఉన్న మురుగునీటి గుంటను తక్షణమే పూడ్చి చేయాలని అధికారులు ఆదేశించారు. తమ ప్రభుత్వంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని గురుకుల పాఠశాలలను అన్ని సౌకర్యాలు కల్పించి మెరుగైన విద్యను అందిస్తామని హామీ రానున్న రోజులలో గురుకుల పాఠశాలలో ఇంటర్ కాలేజీలు సైతం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, బోగోలు మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, కొడూరు వెంకటేశ్వర్ రెడ్డి, లేలపల్లి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.